క్లుప్తంగా

లాసెట్‌లో ఒంగోలు వాసికి 721వ ర్యాంకు


మధురిమ

ఒంగోలు: ఏపీ లాసెట్ తాజాగా విడుదల చేసిన ఫలితాలలో ఒంగోలుకు చెందిన తాళ్లూరి మధురిమ 721వ ర్యాంకు కైవసం చేసుకుంది. ఈమె 5 సంవత్సరాల బీఏ ఎల్ఎల్‌బీ కోర్సులో చేరేందుకు ప్రవేశ పరీక్ష రాసింది. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

నాగేంద్ర స్వామికి ఘనంగా పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

చీమకుర్తి: సంతనూతలపాడులోని నాగేంద్ర స్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులు ఆదివారం ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు సాయిశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని సీఎంకు వినతి

ఒంగోలు: ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీసును రెగ్యులర్ చేయాలని కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ సంఘ రాష్ట్ర చైర్మన్ కుమ్మరికుంట సురేష్ సీఎం చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేశారు. కో చైర్మన్ కల్లూరి శ్రీనివాసులుతో పాటు శనివారం రాత్రి సీఎంను కలిసి వినతిపత్రం అందించారు. ఎన్నికల కోడ్ కారణంగా కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. ఆ ప్రక్రియను పునరుద్ధరించడంతో పాటు సేవల రెన్యువల్ అంశంపై కూడా విజ్ఞప్తి చేశామని, సీఎం సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగాభవాని నెలపొంగళ్లు

పామూరు: మండలంలోని మోపాడు బంగ్లా వద్ద ఉన్న గంగామాత ఆలయంలో అమ్మవారి నెలపొంగళ్లు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గంగామాత మూల విగ్రహమూర్తికి, బొల్లావులకు విశిష్ట పూజలు నిర్వహించారు.

పేదలకు అన్యాయం చేస్తే సహించం

సీఎస్‌పురం(పామూరు): ఆక్రమణల తొలగింపు పేరుతో పేదలకు అన్యాయం చేస్తే సహించేది లేదని సీపీఎం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు అన్నారు. సీఎస్‌పురంలో 167బీ జాతీయ రహదారిపక్కన శనివారం నాడు రెవెన్యూ అధికారులు పడగొట్టిన గుడిసెలు, తొలగించిన పునాదులను ఆదివారం సీపీఎం నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆక్రమణలకు గురయ్యాయంటూ అధికారులు చెబుతున్న ప్రాంతంలో రెవెన్యూ అధికారులు మరోమారు క్షేత్రస్థాయిలో పర్యటించి గుడిసెలు, బేస్మెట్లు వేసుకున్న వారిలో అర్హులను గుర్తించి వారికి అదేస్థానంలో పట్టా మంజూరు చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం

పీసీపల్లి: మండల పరిధిలోని పెదయిర్లపాడు వెలసిన మహారుద్రపీఠంలో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం రెండో సందర్భంగా ఆలయంలో 1116 శివలింగాలకు 108 కలశాలతో ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మృత్యుంజయ హోమం నిర్వహించారు. హోమాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి

వలేటివారిపాలెం(కందుకూరు): గుండెపోటు వీఆర్వో అకస్మాత్తుగా మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి వలేటివారిపాలెంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...పి.సూరిబాబు(60) వలేటివారిపాలెం వీఆర్వోగా పనిచేస్తున్నాడు. వాస్తవానికి అతను ఆదివారం ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. అయితే శనివారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటుతో ఇంట్లోనే మృతి చెందాడు. అనంతరం కుటుంబసభ్యులు మృతదేహాన్ని స్వగ్రామమైన పాదిలికి తరలించారు. దీంతో పలువురు రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు సూరిబాబు మృతికి సంతాపం వ్యక్తం చేశాడు. మృతుడు సూరిబాబుకు భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

విశ్రాంత జీవితం ఆనందంగా గడపాలి


వెలుగొండయ్య కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న ఎంఈవో కిషోర్‌బాబు


రామలింగ వరప్రసాద్‌ను సత్కరిస్తున్న అధికారులు, ఉద్యోగులు


కమలాకరరావును సన్మానిస్తున్న ఉద్యోగులు

● ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబు

ఒంగోలు: విశ్రాంత జీవితాన్ని ఆనందోత్సాహాలతో గడపాలని ఒంగోలు ఎంఈవో టి.కిషోర్‌బాబు ఆకాంక్షించారు. ఆదివారం స్థానిక హోటల్ మౌర్యా ఇన్‌లో స్థానిక సెయింట్ థెరెస్సా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిరియాల వెలుగొండయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 9 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేశారన్నారు. విధి నిర్వహణలో మంచి పేరు సంపాదించుకున్నారని, ఇక నుంచి కుటుంబానికి ఎక్కువ సేవలు అందించాలని సూచించారు. ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కారుణ్య నియామకాలు, ఆరోగ్యకార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సెయింట్ థెరెస్సా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, ఒంగోలు ఎంఈవో-2 పి.సరస్వతి, జరుగుమల్లి ఎంఈవో బత్తుల నాగేంద్రవదన్, బీటీఏ రాష్ట్ర కార్యదర్శి పర్రె వెంకట్రావు తదితరులు పాల్గొని మిరియాల వెలుగొండయ్య కుటుంబ సభ్యులను సత్కరించారు.

భువనంకు ఆత్మీయ వీడ్కోలు

ఒంగోలు అర్బన్: స్థానిక కలెక్టరేట్‌లోని భూ సేకరణ విభాగం పర్యవేక్షకునిగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేస్తున్న భువనం రామలింగ వరప్రసాద్‌ను ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, ఏఓ శ్రీకాంత్ కేదార్‌నాథ్, పీఏ టూ స్పెషల్ కలెక్టర్ సువర్ణమ్మ, ఇతర అధికారులు, సిబ్బంది స్పందన భవనంలో ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. అంకితభావంతో విధులు నిర్వహించిన భువనం ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబంతో సుఖసంతోషాలతో ఆరోగ్యవంతంగా జీవించాలని వక్తలు ఆకాంక్షించారు.

అందరివాడు.. కమలాకరరావు

ఒంగోలు టౌన్: వివిధ పనుల నిమిత్తం ఖజానా కార్యలయానికి వచ్చే ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు అవసరమైన సేవలందిస్తూ అందిరివాడిగా కమలాకరరావు మన్ననలు పొందారని జిల్లా ఖజానాధికారి ఎ.జగన్నాథరావు అన్నారు. సీహెచ్ కమలాకరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పీవీ నారాయణ అధ్యక్షతన జరిగిన సభలో జగన్నాథరావు మాట్లాడుతూ.. కార్యాలయానికి వచ్చే ప్రతిఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ నిబద్ధతగా ఉద్యోగ బాధ్యతలను కమలాకరరావు నిర్వర్తించారని కొనియాడారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాజా రాజ్‌కుమార్, ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ రెడ్డి, పీఏఓ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, పింఛన్‌దారుల సంఘ నాయకుడు ఆల్‌ఫ్రెడ్, అంకిరెడ్డి, హనుమంతరావు, విజయవాడ సమాచార శాఖ అకౌంట్స్ ఆఫీసర్ జి.రమణయ్య, చిత్తూరు, గుంటూరు, నెల్లూరు, నరసరావుపేట, మార్కాపురం సహాయ ఖజానాధికారులు రాజేశ్వరి, హసీనాబేగం, అహమద్, పుల్లారావు, కెనడి, ఏపీటీఎస్‌ఏ నాయకులు అబ్దుల్ ఖాదర్, జె.వెంకటేశ్వర్లు, పి.కోటి, సుధీర్, అస్మత్ బేగ్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కమలాకరరావును ఘనంగా సన్మానించారు. అబ్దుల్ ఖాదర్ పాడిన పాటలు అలరించాయి.

ఉత్తమ సేవకులకు జాతీయ పురస్కారాలు


ప్రశాంతిని సన్మానిస్తున్న శాంతికృష్ణ, తదితరులు

కొత్తపట్నం: తెలుగు వెలుగు జాతీయ పురస్కారాల గ్రహీతలకు ఉత్తమ జాతీయ పురస్కారాలు ప్రదానం చేశారు. కరీంనగర్ జిల్లాలో తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి ఉత్సవాల్లో జాతీయ పురస్కారాలు అందజేశారు. ముఖ్య అతిథులుగా విశ్వకళా విరాట్ బ్రహ్మ డాక్టర్ వంగాల శాంతికృష్ణ ఆచార్య, హాస్యనటులు ఆర్‌ఎస్ నంద, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్, ప్రకాశం జిల్లా నుంచి జైభీమ్ క్యాన్సర్ ఇమ్యూనిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, చైర్మన్ బద్దెపూడి ప్రశాంతి ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ పురస్కారాలు ప్రదానం చేశారు. నృత్య, సేవ ఆచార్య యువ పురోహితులకు, సేవా రంగంలో ఉన్న కళాకారులకు, ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. అనంతరం ప్రకాశం జిల్లాకు చెందిన బద్దెపూడి ప్రశాంతిని సన్మానించారు.

పునర్జన్మ ఇచ్చే అవయవదానం

● సుప్రీం కోర్టు విశ్రాంత జడ్జి టి.మునికృష్ణయ్య


సదస్సులో మాట్లాడుతున్న ఈశ్వర్ లింగం

ఒంగోలు టౌన్: అవయవదానం చేయడమంటే మరొకరికి పునర్జన్మ ఇవ్వడమేనని, ప్రజల్లో అవయవదానం పై సరైన అవగాహన లేకపోవడంతో ఎంతో మంది అభాగ్యులు మరణిస్తున్నారని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి టి.మునికృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ప్రకాశం నేత్ర, అవయవ, శరీర దానం ప్రోత్సాహకుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. నేత్ర, అవయవ దానానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావలసిన అవసరం ఉందన్నారు. అవయవదానం అందరికీ అవసరమని, ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవడమే కాకుండా తమకు తెలిసిన వ్యక్తులకు కూడా అవగాహన కల్పించాలని అమ్మ నేత్ర అవయవదాన ఉద్యమకర్త గంజి ఈశ్వర లింగం కోరారు. అవయవదానం మీద అవగాహన పెంచేందుకు మరిన్ని సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం జిల్లా నోడల్ అధికారి డా.మాధవి లత పిలుపునిచ్చారు. శరీర దాతలు లేకపోవడంతో వైద్య విద్యార్థులు పరిశోధనలు చేయలేకపోతున్నారని, దీనివల్ల నైపుణ్యం కలిగిన వైద్యులు తయారు కావడం కష్టతరంగా మారుతుందన్నారు. ఈ సందర్భంగా సదస్సులో పాల్గొన్న పలువురు ప్రజలు అవయవ దానానికి తమ పేర్లు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు యం సుబ్బారావు, డా.సుబ్బారావు, పి.రామసుబ్బారెడ్డి, బి.కృష్ణ, కోటేశ్వరరావు, రమణయ్య, ఓరుగంటి సీత, పి.రాజ్యలక్ష్మి, వెన్నల సుబ్బారావు, మాదవరావు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

వల్లూరమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో వల్లూరమ్మ తల్లి

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి మూలవిగ్రహ మూర్తికి ఆలయ అర్చకులు అభిషేకాలు చేసిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమ పూజ, గోత్రనామార్చనలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. వేటలు కోసి, నైవేద్యాలు సమర్పించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ రమేష్ భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకులు ఉమాశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గౌడ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు


గౌడ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు అందజేస్తున్న గౌడ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు

ఒంగోలు టౌన్: 2023-24 విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్షలలో 500కుపైగా మార్కులు సాధించిన ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన గౌడ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు ప్రదానం చేశారు. ఆదివారం స్థానిక ఎల్బీజీ భవనంలో నిర్వహించిన కార్యక్రరమంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివిన 40 మంది విద్యార్థులకు వేర్వేరుగా నగదు బహుమతులు అందజేశారు.

మొదటి బహుమతిగా రూ.5000, ద్వితీయ బహుమతిగా రూ.3000, తృతీయ బహుమతిగా రూ.2000 నగదుతో పాటు మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. గౌడ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు తాతా వెంకటేశ్వర్లు గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నెల్లూరు జిల్లా మలేరియా అధికారి ఉదయగిరి నాగార్జున పాల్గొని ప్రసంగించారు. గౌరవాధ్యక్షుడు రంగనాయకులు, ప్రధాన కార్యదర్శి బాలగురవయ్య, అసోసియేట్ అధ్యక్షుడు కె.గురవయ్య, ఉపాధ్యక్షులు మన్నెం వెంకటేశ్వర్లు, జూపల్లె వెంకటేశ్వర్లు, కంచర్ల శశిభూషణ్‌గౌడ్, కోశాధికారి జూపల్లె ఏడుకొండలు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, వసంతరావు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు


అమ్మవారి నగరోత్సవంలో అర్చక స్వాములు


నృత్య ప్రదర్శనలో చిన్నారులు

● అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

ఒంగోలు మెట్రో: స్థానిక మామిడిపాలెంలో వెలసిన గ్రామదేవతలు అంకమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఏడుగంటలకు అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. సాయంత్రం అంకమ్మ మహాలక్ష్మమ్మలను అలంకరించి నగరోత్సవం నిర్వహించారు. దేవస్థానంలో మార్కాపురం శ్రీ విద్యా నృత్య కళామందిరం ఆధ్వర్యంలో జరిగిన సంస్కృతిక కార్యక్రమంలో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టరుకు రూ.20 వేలు జరిమానా

సింగరాయకొండ: కొండపి మండలం కట్టుబడిపాలెంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌కు 20 వేల రూపాయలు జరిమానా విధించినట్లు సెబ్ సీఐ నరహరి తెలిపారు. కట్టుబడిపాలేనికి చెందిన తలారీ వంశి ట్రాక్టరుతో ఇసుక అక్రమంగా తరలిస్తుండగా గతంలో ఒకసారి రూ.10 వేలు జరిమానా విధించామని, రెండోసారి పట్టుబడటంతో రూ.20 వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. సర్కిల్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇతర శాఖల అధికారులు సహకారం అందించాలని కోరారు.

మూఢ నమ్మకాలను వ్యతిరేకించాలి

● జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామారావు


సమావేశంలో ప్రసంగిస్తున్న కుర్రా రామారావు

ఒంగోలు టౌన్: ఉపాధ్యాయులు, విద్యావంతులు మూఢ నమ్మకాలను, మూఢ విశ్వాసాలను వ్యతిరేకించాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన జేవీవీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేపటి పౌరులైన విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైన్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాజంలో ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహించాలని, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పరిశోధనల పట్ల ఆసక్తి పెంపొందించేలా కృషి చేయాలని ఆ సంస్థ జిల్లా గౌరవాధ్యక్షుడు ఏవీ పుల్లారావు సూచించారు. జూలై 4 నుంచి 11వ తేదీ వరకు జేవీవీ సభ్యత్వ నమోదు కోసం ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించాలని, జూలై 31వ తేదీలోపు మండల వార్షిక సభలు నిర్వహించాలని తీర్మానం చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు తిరుపతయ్య, యు.వెంకటరావు, నల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్ఎండీ రఫి, ఎస్‌వీ రంగారెడ్డి, షేక్ బషీరున్నీసా బేగం, జెడ్.రమణయ్య, ఎస్‌టీ వెంకటేశ్, దేవప్రసాద్ పాల్గొన్నారు.

మెగా ఎడ్యుకేషన్ ఫెయిర్ వాల్‌పోస్టర్ విడుదల


వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న న్యామతుల్లాబాషా

ఒంగోలు: స్థానిక ఏ-1 ఫంక్షన్ హాలులో ఈ నెల 6వ తేదీ నిర్వహించనున్న బ్రిలియంట్ మెగా ఎడ్యుకేషన్ ఫెయిర్-2024 వాల్‌పోస్టర్‌ను స్థానిక అంజయ్యరోడ్డులోని బ్రిలియంట్ కంప్యూటర్స్ కార్యాలయంలో సంస్థ అధినేత డాక్టర్ షేక్ న్యామతుల్లాబాషా ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా ఎడ్యుకేషన్ ఫెయిర్ డిగ్రీ, బీటెక్, మెడికల్ సీట్లలో చేరే విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అంతేగాకుండా ఇంజినీరింగ్, మెడికల్ స్టూడెంట్లు వెబ్ ఆప్షన్లు ఎలా ఇచ్చుకోవాలనే దానిపై కూడా అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, రిటైర్డ్ డీజీపీ కేఆర్ఎం కిషోర్‌కుమార్, వివిధ యూనివర్శిటీల వీసీలు, యాజమాన్యాలు, ప్రొఫెసర్లు పాల్గొంటారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎండీ డాక్టర్ తాహూర, కోర్సు కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, డైరెక్టర్ అఖిల్, ఈవెంట్ మేనేజర్ నాగార్జున పాల్గొన్నారు.

గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి

ఉలవపాడు: విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నీతి కథలు, మహనీయుల చరిత్ర, జనరల్ నాలెడ్జికి సంబంధించిన పుస్తకాలు చదివించారు. గ్రంతాలయాలలో ఉన్న పుస్తకాలను పరిశీలించి అన్ని రకాల పుస్తకాలను చదవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో క్రీడలను ఆడించారు.

6 నుంచి నవరాత్రి ఉత్సవాలు

కనిగిరి రూరల్: పట్టణంలోని దేవాంగనగర్‌లో ఉన్న లక్ష్మీ నరసింహా స్వామి ఆలయంలో జూలై 6 నుంచి 15వ తేదీ వరకు వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని కేటీఆర్ విద్యా సంస్థల అధినేత, ఆలయ ధర్మకర్త, వ్యవస్థాపకుడు కుందురు తిరుపతిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆలయ కమిటీ నాయకులు నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. ఈసందర్భంగా కుందురు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ పది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాల కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు. ప్రతి రోజు అమ్మవారికి అభిషేకం, ఉదయం 9 గంటలకు చండీ హోమం, మద్యాహ్నం 1 గంటకు మంగళ హారతి తీర్థప్రసాద వినియోగం సాయంత్ర 6 గంటలకు వారాహి అమ్మవారికి విశేషంగా సువాసినులచే సామూహిక కుంకుమార్చన, అనంతరం మంగళహారతీ తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు పులి శ్రీనివాసులరెడ్డి, శింగరాజు మాలకొండేశ్వరరావు, మాకినేని సాయిరాం, ఉప్పాల సుబ్బారావు, మార్నెళ్ల ఉమాకాంత్, నున్నా కృష్ణా, ఈర్ల విజయరామరాజు, సుబ్బారెడ్డి, మాలకొండయ్య, రఘురామిరెడ్డి, శ్రీను, ఆడిటర్ ప్రసాద్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు సూర్యశ్రీ ట్రస్టు సహకారం


ఆర్థిక సాయం అందజేస్తున్న సూర్యశ్రీ ట్రస్ట్ ప్రతినిధులు

ఒంగోలు టౌన్: గుండెపోటుతో మరణించిన ఒక నిరుపేద వ్యక్తి అంత్యక్రియలకు నగరానికి చెందిన సూర్యశ్రీ ట్రస్ట్ సహకారం అందించింది. ఒంగోలు మండలంలోని ఉలిచి గ్రామానికి చెందిన అన్నపురెడ్డి హనుమంతరావు (45) గుండెపోటుతో మరణించారు. రెక్కాడితేనే డొక్కాడని కుటుంబం కావడంతో హనుమంతరావుకు అంత్యక్రియలు చేసే స్తోమత కూడా లేని ఆ కుటుంబం దిక్కుతోచని పరిస్థితిలో పడింది. ఈ విషయం సూర్యశ్రీ సలహాదారుడు మండవ సుబ్బారావుకు తెలిసింది. వెంటనే స్పందించిన ఆయన.. సూర్యశ్రీ ట్రస్ట్ కార్యదర్శి షేక్ సర్దార్‌కు సమాచారం అందించారు. ప్రవాస భారతీయుడు బాబు బాల సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. అంత్యక్రియలకు అవసరమైన 11 వేల రూపాయలను ఆయన సమకూర్చారు. ఆ మొత్తాన్ని హనుమంతరావు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సూర్యశ్రీ ట్రస్ట్ సలహాదారులు మండవ సుబ్బారావు, కార్యదర్శి షేక్ సర్దార్ బాషా, చుంచు సింగయ్య, ఎర్రంనేని వెంకట శేషయ్య, చుంచు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పొంగళ్లు

లింగసముద్రం: మండలంలోని తిమ్మారెడ్డిపాలెం గ్రామ దేవత పోలేరమ్మతల్లికి భక్తులు ఆదివారం పొంగళ్లు పెట్టి తమ భక్తిని చాటుకున్నారు. గ్రామదేవత పోలేరమ్మతల్లి, బొడ్డురాయి సీతాలమాత తృతీయ వార్షిక మహోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు గ్రామంలో తిరునాళ్లను నిర్వహించారు. భక్తులు అమ్మవారికి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. మూడు రోజులుగా జరుగుతున్న పోలేరమ్మతల్లి తిరునాళ్ల ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా మహిళలు మేళతాళాలతో పొంగళ్ల సామగ్రిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.


ఆలయంలో పొంగళ్లు పెడుతున్న భక్తులు

పింఛన్ల పంపిణీ సమర్థవంతంగా నిర్వహించాలి

కందుకూరు: లబ్ధిదారులకు సకాలంలో పింఛన్ పంపిణీ చేయాలని డీఎల్‌పీఓ కృష్ణమోహన్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గుడ్లూరు మండలంలోని మోచర్ల గ్రామ సచివాలయాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పింఛన్ల పంపిణీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో ఉదయం 6 గంటల కల్లా పింఛన్ పంపిణీ ప్రారంభించాలన్నారు. ప్రభుత్వ జాబితాలో ఉన్న ప్రతి లబ్ధిదారుడికి పింఛన్ ఇవ్వాలని, మొత్తం రూ.7,000లను లబ్ధిదారులకు ఇవ్వాలని సూచించారు. సచివాలయ పరిధిలో పనిచేసే ఉద్యోగులంతా సచివాలయంలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఏ లబ్ధిదారుడికి ఇబ్బంది కలగకూడదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.